నవతెలంగాణ

1

నల్లగొండ

గురువారం | ఫిబ్రవరి 27, 2025 | www.navatelangana.com





నేడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

నేడు వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాకేంద్ర సమీపంలోని ఆర్జాలబావి పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి సందర్శించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాటులను పర్యవేక్షించి పోలింగ్‌కు నియమించిన సిబ్బందితో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఎన్నికలో 19మంది బరిలో ఉన్నారు. జిల్లాలో 37పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికలలో 752 మంది సిబ్బందిని నియమించారు. 37 పోలింగ్ కేంద్రాలు ఉండగా ,అందులో 5 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. 618 మంది పోలీసుల సేవలను వినియోగించుకోనున్నారు.





1న నల్లగొండకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాక

నవతెలంగాణ-క్లాక్‌టవర్

మర్చి1న సీపీఐ(ఎం) రాష్ట్ర నూతన కార్యదర్శి జాన్‌వేస్లీ నల్గొండకు రానున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాన్‌వెస్లీ రాక సందర్భంగా మర్రిగూడ బైపాస్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నుండి బైకు ర్యాలీ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, ప్రజా సంఘాల జిల్లా కమిటీలు సభ్యులు, నల్గొండ పట్టణములోని వివిధ కార్మిక, యూనియన్ రంగాలకు చెందిన ముఖ్య కార్యకర్తలు తప్పకుండా సమయానికి హాజరు కావాలని పేర్కొన్నారు. అనంతరం సీపీఐ(ఎం) కార్యాలయంలో 11.30 కు విలేకర్ల సమావేశం ఉంటుందని, తర్వాత కోటిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఉంటుందని తెలిపారు. జాతీయ మహాసభల ముసాయిదా తీర్మానం, రాజకీయ తీర్మానం పై చర్చ ఉంటుందని పేర్కొన్నారు.

ఎత్తిపోతల పథకాలను ...
ప్రభుత్వమే నిర్వహించాలి



- లిఫ్ట్ రైతు సంఘం అధ్యక్షులు పాదూరు శిశిధర్‌రెడ్డి

నవతెలంగాణ-వేములపల్లి

నాగార్జున సాగర్ ఎడమ కాలువపై ఉన్న ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వమే నిర్వహించాలని, ఎత్తిపోతల సమస్యలను పరిష్కరించాలని లిఫ్ట రైతుల సంఘం అధ్యక్షులు పాదూరు శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు.బుధవారం మండల పరిధిలోని లిఫ్ట ఇరిగేషన్ లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సాగర్ ఎడమ కాలువపై 8 సంవత్సరాల క్రితం ఎత్తిపోతల పథకాల ఆధునికరణ సమయంలో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయకుండా పైప్ లైన్లు,యంత్రాలకు సంభందించిన పనులు మాత్రమే చేశారన్నారు.కాలువ పూడికలు, తూములు,షట్టర్లు, రహదారులు మరమ్మతులు చేయకుండా వదిలేశారన్నారు. దాని వల్ల నీరు చివర భూములకు వెళ్ళే పరిస్థితి లేక బీడు భూములుగా మారిపోయాయన్నారు.వీటితో పాటుగా మోటార్లు,స్టాటర్లు, పంపులు, ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయినప్పుడు బాగుచేసుకోవాలంటే పెద్ద మొత్తంలో డబ్బులు కావాల్సి వస్తుందని వీటిని రైతులు తమ సొంత ఖర్చులతో బాగుచేసుకోలేక లిఫ్టులు నడిచే పరిస్థితి లేదన్నారు. కొంతమంది రైతులు ద్వారా వచ్చే సొమ్ముతో ఆపరేటర్ల జీతాలు చెల్లిస్తున్నారన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్‌లకు సంబంధించిన అధికారులు సమస్యలపై నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి పంపాలని, లేనిచో రైతులంతా కలిసి ఈఈ,ఎస్‌ఈ ఆఫీసుల ముందు ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాదూరు గోవర్ధన, వినోద్,చిరుమల్ల భిక్షం, రేనయ్య, పిచ్చిరెడ్డి, నాగయ్య, వెంకట్ రెడ్డి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న మృతిపై దర్యాప్తు వేగవంతం చేయాలి



నవతెలంగాణ-నిడమనూరు

మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలోని సిలికాన్ క్వారీలో జరిగిన బిల్లకంటి వెంకన్న మృతిపై దర్యాప్తు వేగవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బొజ్జ చిన్నమాదిగ డిమాండ్ చేశారు. బుధవారం మండలకేంద్రంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ సంఘటన జరిగి నెల రోజులు గడుస్తున్నా కేసులో పురోగతి లేదని ,సీసీ కెమెరా ఫుటేజ్‌ని క్షుణ్ణంగా పరిశీలించి నిందితులను పట్టుకుని శిక్షించాలని కోరారు, మృతుడి కాల్ డేటాను సేకరించాలని, సీసీ కెమెరాలో కనిపించిన అపరిచిత వ్యక్తిని గుర్తించాలని అన్నారు. క్వారీలో జరిగిన సంఘటనకు క్వారీ యజమాని బాధ్యత తీసుకోవాలని, ఇంత జరిగినా క్వారీ యజమానిని ఇంతవరకు పోలీసులు విచారణ చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తుందని పేర్కొన్నారు. అక్రమంగా క్వారీ నిర్వహిస్తూ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నాడని, గడువు మిగిసినా అధికారులను మచ్చిక చేసుకొని దందాకు పాల్పడుతున్న పట్టించుకునే వారే లేరన్నారు. క్వారీలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు, వెంటనే విచారణ వేగవంతం చేసినిందితులను శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు లివ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి కోటేష్, ఎమ్మార్పీ జిల్లా బొజ్జ పుల్లయ్య, సిఐటియు మండల కన్వీనర్ కోమాండ్ల గురువయ్య, కొంచెం శేఖర్ బొజ్జ ఈదయ్య పాల్గొన్నారు.

ఘనంగా మహాశివరాత్రి

- ఏలేశ్వరం కొండకు పోటెత్తిన భక్తజనం



నవతెలంగాణ-నాగార్జునసాగర్

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం నాగార్జునసాగర్ కృష్ణా నదీ తీరాన ఉన్న శివాలయాలలో భక్తులు పోటెత్తారు. సాగర్ జలాశయం మధ్యలో ఉన్న మల్లయ్య గట్టుగా పిలవబడే ఏలేశ్వరం కొండకు బుధవారం తెల్లవారుజాము నుండి భక్తులు పోటెత్తారు. సాగర్లోని తెలంగాణ టూరిజం లాంచీలలో ఏలేశ్వరం కొండకు చేరుకొని 1000 అడుగుల ఎత్తున ఉన్న కాత్యాయిని మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. తెలంగాణ ప్రాంతం నుండే కాక ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని నాగార్జునసాగర్ అనుపు ప్రాంతం నుండి అధిక సంఖ్యలో భక్తులు ఏలేశ్వరం కొండను దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏలేశ్వరం కొండకు దర్శనానికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసు విభాగం ఏలేశ్వరం కొండపై భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించారు. ఏలేశ్వరం కొండ సందర్శించే భక్తుల కోసం స్థానిక అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ కేంద్రం నుండి మెడికల్ క్యాంపు నిర్వహించారు.

నకిరేకల్ : పట్టణం లోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మహా శివరాత్రి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటల నుండి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ఆ పరమేశ్వరుని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం కమిటీ చైర్మన్ ఉప్పల రమేష్, ధర్మకర్తలు బొప్పని యాదగిరి, కొండ వెంకన్న గౌడ్, చెన్న చంద్రశేఖర్ నేత, కంధాల ప్రవీణా రత్నారెడ్డి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చలువ పందిళ్ళు వేయించి క్రమ పద్ధతిలో దర్శనాలు చేసుకొనే విధంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్‌లు కొండ జానయ్య గౌడ్, వీరవెల్లి రఘునాథ్, మీలా దేవేంద్ర ప్రసాద్, కోటగిరి శ్రీనివాస్, పూసల నారాయణ, మంచుకొండ సోమయ్య పాల్గొన్నారు. మహా శివరాత్రి సందర్భంగా శ్రీ రామలింగేశ్వర స్వామిని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గార్లపాటి రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ చౌగొని రాములమ్మ సైదులు గౌడ్, చౌగోని అఖిల లక్ష్మణ్ గౌడ్ తదితరులు ఉన్నారు.





మత సామరస్యానికి ప్రతీక సయ్యద్ హజ్రత్ అబాస్ దర్గా

- మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

నవతెలంగాణ-చింతపల్లి

మత సామరస్యానికి ప్రతీక సయ్యద్ హజ్రత్ అబాస్ దర్గా అని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.బుధవారం మండలంలోని పీకే మల్లెపల్లిలోని సయ్యద్ హజ్రత్ అబాస్ దర్గాలో దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ఆడి ముందుకు సాగాలి



నవతెలంగాణ-తిరుమలగిరి సాగర్

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడి తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి క్రికెట్ క్రీడలో రాణించాలని ఎస్ఐ వీరశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని రాజవరం గ్రామంలో మహాశివరాత్రి పండగ సందర్భంగా గ్రామీణ స్థాయి క్రికెట్ పోటీలను కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డం సాగర్ రెడ్డి ,కాంగ్రెస్ జిల్లా నాయకులు యడవెల్లి వల్లభ రెడ్డి లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడల వల్ల స్నేహబావం పెంపొందుతుందని అన్నారు. క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని తెలిపారు. కమిటీ సభ్యులు లింగాల మల్లికార్జున్ షేక్ నజీర్, చారీ, యాది, షాకూరు, సాయి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి

- ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి



నవతెలంగాణ-పెద్దవూర

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని అలవర్చు కోవాలని శాసన మండలి సభ్యులు మంకెన కోటిరెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం పెద్దవూర మండలం చింతపల్లి గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా తెలంగాణ తొలి దళితకవి దున్నఇద్దాస్ ఆరాధనోత్సవాలను పురస్కరించుకొని చింతపల్లి గ్రామం లో నిర్వహించిన కబడ్డి పోటీలలో విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. చింతపల్లి గ్రామంలో వెలసిన శ్రీ దున్న ఇద్దాసు జాతర సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఎన్నో ఏళ్ల చరిత్ర గల దున్న ఇద్దాసును స్మరించుకుంటూ ప్రతి ఏటా జాతర్లను నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రతి ఓటమీ మరో గెలుపుకు పునాది కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సుంకిరెడ్డి పద్మావతి సంజీవరెడ్డి, నడ్డి లింగయ్య యాదవ్, జిల్లా బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు షేక్ అబ్బాస్, వికారాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అర్కేపల్లి అంజనేయులు,దున్న సురేష్, మండల యువ నాయకులు సత్యనారాయణ యాదవ్, గ్రామస్తులు, క్రీడాకారులు,క్రీడా అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

బంగారు మైసమ్మను దర్శించుకున్న బిగ్ బాస్ షో నటులు

నవతెలంగాణ-కేతపల్లి



మహా శివరాత్రి పండగ సందర్భంగా బుధవారం ఖమ్మం వెళ్తున్న మూవీ ఆర్టిస్ట్ ,బిగ్ బాస్ షో మానస్ , కార్తీకదీపం హీరో నిరూపన్, సతీమణి మంజుల గాయకుడు నల్గొండ గద్దర్ నర్సిరెడ్డి మండలంలోని ఉప్పలపాడు గ్రామ శివారులో 65 నెంబర్ జాతీయ రహదారి వెంట ఉన్న శ్రీ బంగారుమైసమతల్లీ దేవాలయం ని దర్శించుకున్నారు. వారిని డీసీఎంఎస్ చైర్మెన్‌బోళ్ల వెంకట్ రెడ్డి, కేతేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంపసాటి శ్రీనువాసు యాదవ్ మాజీ ఎంపీపీ పెరుమాళ్ళ శేఖర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సందీప్ రెడ్డి ఉప్పలపాడు గ్రామ శాఖ అధ్యక్షులు గుర్రం సైదిరెడ్డి గుర్రం వెంకట్ రెడ్డి ఏరుపుల నాగరాజు యాదవ్ గారుమున్నా అశోక్ దాచేపల్లి నాగేశరావు గణేష్ పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఒకటవ వార్డులో వీధిలైట్ల ఏర్పాటు



నవతెలంగాణ-నకిరేకల్

మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో లైట్లు లేని చోట కొత్త లైట్ల ఏర్పాటుతో పాటు పాడైపోయిన వాటిని మరమ్మతు చేయించడం జరిగిందని మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత శ్రీనివాస్ తెలిపారు.బుధవారం వీధిలైనట్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కందాల బిక్షం రెడ్డి, మున్సిపల్ కరెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- శృతి మించుతున్న వేడుకలు
- నాటి అర్థాన్ని మారుస్తున్న నేటి స్వపరిపాలన
- కనపడని మాక్ అసెంబ్లీ, మాక్ పార్లమెంట్
- స్వపరిపాలన తీరుమారాలి

స్వపరిపాలనలో.. ఒకరోజు హంగామా..!



నవతెలంగాణ- నకిరేకల్

స్వపరిపాలన అంటే తమకు తాముగా పరిపాలన చేసుకోవడం. పాఠశాల విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపేందుకు స్వపరిపాలన దినోత్సవం ప్రతి పాఠశాలలోనూ ప్రతి ఏటా నిర్వహిస్తుంటారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులు తమకు అత్యంత ఇష్టమైన ఉపాధ్యాయుని అనుసరించి ఆ ఉపాధ్యాయుడు బోధిస్తున్న సబ్జెక్టును బోధించేందుకు ఉత్సాహంగా ముందుకొచ్చి ఆ సబ్జెక్టును బోధించేవారు. మరికొందరు పీఈటీ, అటెండర్లు, వివిధ రకాల పోస్టులు ధరించి ఆ ఒక్కరోజు విద్యార్థినీ విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలో ఉద్యోగం చేస్తున్న వారిని అనుకరిస్తూ ఉంటారు. కేవలం పదవ తరగతి విద్యార్థులకు మాత్రమే జిల్లా కలెక్టర్, డీఈవో, ఎంఈఓ పోస్టులను పాఠశాల యాజమాన్యం అవకాశం కల్పిస్తుంది. ఈ స్వపరిపాలనా దినోత్సవం రోజున కలెక్టర్ పాత్ర వరకు మాత్రమే విద్యార్థులు వేషధారణతో పాఠశాలకు హాజరయ్యేవారు.

శ్రుతి మించిన స్వపరిపాలన

మారుతున్న కాలానుగుణంగా విద్యార్థిని విద్యార్థులు తమ ఉపాధ్యాయులను అనుకరించకుండా రాజకీయ నాయకులను అనుకరిస్తూ స్వపరిపాలనకు ఉన్న అర్థాన్ని మారుస్తున్నారు. గతంలో జిల్లా కలెక్టర్ పాత్ర వరకు ఉన్న స్వపరిపాలన. నేడు ఎమ్మెల్యే ఎంపీ, మంత్రులు, ముఖ్యమంత్రి, గవర్నర్, మాజీ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి పోస్టులు సృష్టించి విద్యార్థులలో హంగామా రాజకీయాలు ఎలా చేయాలో పాఠశాల యాజమాన్యాలు నేర్పించడం దురదృష్టకరం. ఎమ్మెల్యే అంటూ ఒకరు 10 కార్లలో వస్తే, మంత్రి వేషధారణలో 15కార్లలో పోలీస్ సైరన్ వేసుకుంటూ పాఠశాలకు చేరుకుంటున్నారు. ఒకరు సీఎంగా వేషధారణ వేసుకుని 20 కార్లలో వస్తే, మరొకరు పీఎంగా 30 కార్లలో సైరన్‌ల మధ్య బైక్ ర్యాలీలు, సెంటర్లలో బాంబుల మోతతో ఊదరగొడుతున్నారు. చెవులకు చిల్లులు పడే విధంగా డీజే శబ్దాలతో సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వారి ర్యాలీని డ్రోన్ల సహాయంతో ఫొటో షూట్‌లు చేయడమే కాకుండా ట్రాఫిక్ కు అంతరాయాన్ని కలిగిస్తూ స్వపరిపాలనను అబాసుపాలు చేస్తున్నారు.

మాక్ అసెంబ్లీ, మాక్ పార్లమెంటు ఎక్కడ...?

విద్యార్థులకు రాజకీయాల మీద అవగాహన కోసం గతంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో మాక్ అసెంబ్లీ, మాక్ పార్లమెంట్ కార్యక్రమాలు నిర్వహించేవారు. రాజకీయాలలో హుందాగా ఎలా ఉండాలి. ప్రజలతో ఎలా నడుచుకోవాలి. ప్రజలతో మమేకమై పని చేసినప్పుడే రాజకీయాలకు సార్థకత చేకూరు తుందన్న అంశాలను విద్యార్థులకు వివరించేవారు. రాజకీయాలు హంగామా కోసం కాదని, సేవ కోసమని వారికి ప్రాక్టికల్ గా చేసి చూపించేవారు. కానీ నేడు మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠశాల యాజమాన్యాలు సైతం మారిపోయి చదువే ధ్యేయంగా మార్కులే లక్ష్యంగా నిరంతరం విద్యార్థులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. విద్యార్థులకు సమాజంపై కనీస అవగాహన లేకుండా పుస్తకాల పురుగుగా వారిని తయారు చేస్తున్న పరిస్థితి ఉంది. ఈ తరుణంలో స్వపరిపాలన దినోత్సవం అంటూ ఒకరోజు ప్రజాప్రతినిధుల వేషధారణలు వేయిస్తున్నారు. ఈ పోస్టులకు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అధిక మొత్తంలో దండుకుంటున్నారు. అంతేకాకుండా హంగామా చేసేందుకు కార్లకు సైతం డబ్బులు చెల్లించాల్సిందే. దీంతో విద్యార్థులతో రహదారుల వెంబడి ప్రజా ప్రతినిధుల, రాజకీయ నాయకుల వేషధారణలో హంగామా సృష్టిస్తున్నారు. విద్యార్థులు సైతం ఉపాధ్యాయ పోస్టుల కంటే ప్రజాప్రతినిధుల, రాజకీయ నాయకుల పోస్టులకు ప్రాధాన్యతనిస్తూ అధిక మొత్తంలో పాఠశాల యాజమాన్యాలకు చెల్లిస్తున్న పరిస్థితి ఉంది.

స్వపరిపాలన తీరు మారాలి

పాఠశాలల్లో నిర్వహించే స్వపరిపాలన వేడుకల తీరు మారాలని పలువురు చర్చించుకుంటున్నారు. ఇదేమి వేషాధారణ, ఇదేమి పద్ధతి అంటూ ప్రజలు పలు విధాలుగా మాట్లాడుతున్న పరిస్థితి ఉంది. స్వపరిపాలన అర్థం మారిపోకుండా పాఠశాల స్థాయిలో హుందా రాజకీయాలు ఎలా చేయాలో, ప్రజా ప్రతినిధులు ఎలా నడుచుకోవాలో వివరిస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.

మండల కేంద్రానికి చేరిన పోలింగ్ మెటీరియల్, సిబ్బంది



నవతెలంగాణ-ఆత్మకూరు ఎస్

ఆత్మకూరు మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాల లో 145 ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం నకు బుధవారం పోలింగ్ మెటీరియల్ , పోలింగ్ సిబ్బంది రావడం సాయంత్రానికి చేరుకోగా మండల తహసిల్దార్ హరిచంద్ర ప్రసాద్ మెటీరియల్ పరిశీలించి తగిన ఏర్పాట్లు చేశారు. రేపు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ఉంటుందనీ ఓటర్లందరూ సకాలంలో వచ్చేసి ఓటును వినియోగించుకోవాలని కోరారు.


ఆలయాల్లో మారుమోగిన శివనామస్మరణ

నవతెలంగాణ-హుజూర్ నగర్



శివరాత్రి పర్వదినము సందర్భంగా పట్టణంలోని భీమ లింగేశ్వర స్వామి ఆలయ పరిసరాలు భక్తుల శివ నామ స్మరణలతో మారుమోగాయి. ఉదయం 3 గంటల నుండి భక్తులు ఆలయానికి రావడం ప్రారంభించారు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకొని పూజ నిర్వహించారు ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ అన్ని ఏర్పాట్లను చేసి దగ్గరుండి చూసుకున్నది. ఆలయానికి వచ్చిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను అందించారు రాత్రి సుందరకాండ పారాయణం అభిషేకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓరుగంటి నాగేశ్వరరావు, కంచర్ల శ్రీనివాసరెడ్డి, కీత మల్లికార్జున్, సైదులు, పొనుగుపాటి ఆలయ అశోక్, కోట సూర్యప్రకాష్, మహేష్ పాల్గొన్నారు.

మిర్చి సాగు.. భారం



- గిట్టుబాటు ధరలు రాక రైతుల దిగులు.. క్వింటాల్‌కు రూ.12వేలు కూడా రాని వైనం
- మార్కెట్ రోజురోజుకి పడిపోతున్న ధరలు.. భారీగా పెరిగిన పెట్టుబడి వ్యయం
- అప్పుల పాలయ్యామంటున్న రైతులు.. పట్టించుకోని ప్రభుత్వం

నవతెలంగాణ-మునగాల

ఈ ఏడాది మిర్చి పంటలకు సరైన గిట్టుబాటు ధరలు రాక రైతులు దిగులు చెందుతున్నారు. మిరప ధరలు మరింతగా పడిపోవటంతో రైతులు కంటతడి పెడుతున్నారు. పెట్టుబడులకు అనుగుణంగా ధరలు రావటం లేదని మొత్తుకుంటున్నారు. ఎకరానికి ఇంచు మించుగా రెండు లక్షల వరకు పెట్టుబ డులు పెట్టామని రైతులు పేర్కొం టున్నారు. మార్కెట్‌లో మిర్చికి రోజు రోజుకు ధరలు తగ్గించి కోనుగోలు చేస్తున్నారని రైతులు ఆ రోపిస్తున్నారు. అసలే ధరలు లేక తిప్పలు పడుతుంటే వ్యాపారులు సిండికేట్ అయ్యి ధరలను తగ్గించి రైతులను దోపిడీ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్వింటా మిరపకాయ రూ.11వేల నుంచి రూ.12 వేలు మాత్రమే ధర పలుకుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది క్వింటా మిర్చికి 24వేల ధర లభించిందని జగ న్నాధపురం గ్రామానికి చెందిన రై తు వీరబోయిన వెంకన్న తెలిపారు. గత ఏడాదితో పొల్చితే ఈ ఏడు ధరలు సగానికి సగం పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు దారుణంగా పడిపోవటంతో రైతులు దివాళా తీసే పరిస్థితి దాపురించింది. ఎప్పటి మాదిరిగానే గిట్టుబాటు ధరలు అందుతాయని రైతులు ఆశ పడ్డారు. దీంతో అనేక మంది రైతులు తేజా వెరైటి రకం మిరప పంట సాగు చేపట్టారు. ఈ రకం మిరప కాయలకు విదేశాల్లో మంచి డిమాండ్ వుంది. అదే ఆశతో తిరిగి తేజా కాయల సాగునే చేపట్టారు.

పంటల మీద ఇబ్బడిముబ్బడిగా పెట్టుబడులు పెట్టేందుకు కూడా వెనకాడలేదు. మంచిగా దుక్కి తయారు చేసేందుకు 6వేలు ఖర్చు చేస్తున్నారు. అధిక దిగుబడులు సాధించాలనే పట్టుదలతో నాణ్యమైన విత్తనాలను ఎంచుకుంటున్నారు. 10గ్రాముల తేజా విత్తనాలకు 800 ధర పలుకుతోంది. ఇలాంటివి ఎకరానికి 12ప్యాకెట్ల విత్తనాలు అవసరం అవుతాయి. విత్తనాల కోనుగోలుకే ఒక ఎకరానికి 9,600 వరకు ఖర్చు అవుతుంది. మిరప మొక్కలు నాటు వేసే కూలీలకు 4500. ఇంకా వివిధ రకాల డిఏపి, కాంప్లెక్స్, పోటాష్, యూరియా వంటి రసాయన ఎరువులు16బస్తాల వరకు వినియోగించవల్సి వుంటుందని జగన్నాధపురం గ్రామానికి చెందిన బొల్లం సైదులు అనే రైతు తెలిపారు. ఎరువులకు రూ.50వేలు ఖర్చు అవుతాయని చెప్పారు. పంట చేతికొచ్చే వరకు సుమారుగా 20 సార్లు ఇంకా అంత కంటే అదనంగానే క్రిమిసంహారక మందులను పిచికారి చేయవల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. తీరా పూత సమయంలో నల్లపేను, ఎర్రనల్లి ఆ శించటంతో మిరప పంటలు తెగుళ్ల భారీన పడుతున్నాయని మరో రైతు రెడ్డబోయిన మల్లేష్ తెలిపారు. ఎకరానికి సస్యరక్షణ చర్యల కోసం సుమారుగా రూ.60 వేలు అవుతున్నాయని చెప్పారు. ప్రతి నాలుగు రోజులకు ఒకసారి పురుగు మందు స్ప్రే చేయకపోతే పైర్లు ఎర్రబారి పోతున్నాయని తెలుపుతున్నారు. చేలో అరక ఎద్దులతో ఎనిమిదిసార్లు అచ్చు తొలితే తడవకు వెయ్యి చొప్పున రూ.8 వేలు అరక కిరాయిలు అవుతున్నాయని తెలుపుతున్నారు. ఎకరానికి మిర పకాయలు ఎరే కూలీలకే రూ.60 నుంచి 70వేలు కూలీ ఖర్చులు అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాయ ఎరాలంటే ఎకరానికి సుమారు 250 కూలీలు అవసరం అవుతారని చెప్పారు. ఒక్కొక్క కూలీకి రోజుకు 300చొప్పున కూలీ ఇవ్వాల్సి వుంటుందన్నారు. ఇన్ని కష్టాలు నష్టాలు పడ్డా ఎకరానికి 20క్వింటాల దిగుబ డులు వచ్చేదే కష్టంగా వుందన్నారు. ధరలురాక దిగుబడులు రాక అప్పుల ఊబిలో కూరుకు పోతున్నామని మిరప రైతులు మొత్తుకుంటున్నారు. మండలంలోని నాన్ ఆయకట్టు గ్రామాలైన జగన్నా ధపురం, రేపాల, నర్సింహుల గూడెం, మాధవరం, నేలమర్రి గ్రామాలలో సుమారు 350 ఎకరాలలో రైతులు మిరప పంటలు సాగు చేశారు. ధరలు లేక పండిన పంటలను ఖమ్మం మార్కెట్‌లో తక్కువ ధరలకు అమ్ముకుంటున్నామని చెప్పారు. ఆరుగాలం కష్టపడినా శ్రమకు తగ్గ ఫలితం దక్కటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

మిర్చికి సరైన ధర లేదు: వీరబోయిన వెంకన్న-రైతు జగన్నాధపురం



నేను రెండు ఎకరాలలో మిర్చి పంట వేశాను. ఈ ఏడాది మిర్చి పంటలకు సరైన ధరలు లేవు. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించటం లేదు. ఇదే అదునుగా వ్యాపారులు సిండికెట్‌గా మారి ధరలను మరింత తగ్గిస్తున్నారు. క్వింటాల్ రూ.12వేలకు కూడా అమ్ముడు పోవటం లేదు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

తెగుళ్ల కారణంగా దిగుబడులు తగ్గాయి: బొల్లం సైదులు-రైతు జగన్నాధపురం



నేను రెండు ఎకరాలు మిర్చి వేశాను. ఈ ఏడు ధరలు పూర్తిగా పడిపోయాయి. తెగుళ్ళ కారణంగా ది గుబడులూ తగ్గాయి. ఎకరాని లక్షన్నర వరకు పెట్టుబడులు అవుతున్నాయి. పండిన పంటను ఎమి చేయాలో తెలియటం లేదు.

అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాం: రెడ్డబోయిన మల్లేష్ రైతు



అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టాం. చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియటం లేదు. మిర్చి పంటల సాగుకు అన్ని రకాల పెట్టుబడులు పెరిగి పోయాయి. తల పట్టుకునే రోజులు దాపురించాయి. ప్రభుత్వమే ఆదుకోవాలి.

కాల్వకు వెంటనే నీటిని విడుదల చేయాలి

- అధికారులకు ఎమ్మెల్యే పద్మావతి ఆదేశం



నవతెలంగాణ-మునగాల

మండలంలో తాగు సాగు నీటి ఇబ్బందులను తీర్చేందుకు వెంటనే శ్రీరాంసాగర్ నీటిని విడుదల చేయాలని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి ఆదేశించారు. బుధవారం మండలంలో వెంకట్రామపురం, నేలమర్రి, తాడువాయి గ్రామాలలో నీటి ఇబ్బందుల గురించి గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పదించిన ఆమె జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫోన్ ద్వారా కాల్వకు వెంటనే నీరు విడుదల చేయాలని సూచించారు. మునగాల మండలంలో సాగు తాగునీటి ఇబ్బందులను తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో నీటి ఎద్దడితో పొలాలు ఎండిపోతున్నాయని అధికారుల దృష్టికి తెచ్చారు. తక్షణమే పరిష్కారం చూపాలన్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల కార్యదర్శి కీత రమేష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తక్కెళ్లపాటి సాయి,వివిధ గ్రామరైతులు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన శివాలయాలు



నవతెలంగాణ-సూర్యాపేట

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక శ్రీ సంతోషి మాత దేవాలయంలో శ్రీ సత్య సాంబ శివ స్వామి వారికి ఆర్యవైశ్య సంఘం కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్, శృతి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో పట్టణ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఇటీవల ఆర్యవైశ్య సంఘం కోశాధికారిగా లక్ష్మీ కాంత్ నియామకం అయిన సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు ఆయన్ని సన్మానించారు.ఈ కార్యక్రమంలో శ్రీ సంతోషిమాత దేవాలయం ప్రధాన కార్యదర్శి బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, కమిటీ సభ్యులు కొత్త మల్లికార్జున్, తాళ్లపల్లి రామయ్య, గోపారపు రాజు, బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య యామా వెంకటేశ్వర్లు, నూకా రవిశంకర్, చల్లా సత్యనారాయణ, ఉప్పల భాగ్యరేఖ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

చిలుకూరు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళలు బుధవారం తెల్లవారుజాము నుండి శివాలయాలలో పోటెత్తినారు భక్తిశ్రద్ధలతో పసుపు కుంకుమలతో శివాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు చిలుకూరు మండల కేంద్రంలో బేతవోలు గ్రామంలో నారాయణపురం గ్రామంలో జెర్రీ పోతుల గూడెం గ్రామంలో శివాలయాలు ఆయా గ్రామాల ప్రజలు శివనామస్మరణంతో మార్మోగినాయి కొంతమంది మహిళలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు జాగారాలు చేస్తున్నారు మహిళలతో పాటు పురుషులు కూడా శివాలయాల్లో దర్శనాలు చేసుకున్నారు ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కోదాడటౌన్: మహాశివరాత్రి ని పురస్కరించుకొని శైవ క్షేత్రాలు శివ నామస్మరణతో మారుమోగాయి. బుధవారం కోదాడ పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం, కోదండ రామాలయంలో గల శివాలయం, బాలాజీ నగర్ పరిధిలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద శివాలయంలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం తెల్లవారుజాము నుండే పెద్ద ఎత్తున పాల్గొని పరమేశ్వరునికి అభిషేకాలు నిర్వహించారు. శివనామస్మరణతో భక్తులు శివలింగాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు భక్తుల కొరకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి స్వామి వారి దర్శనభాగ్యాన్ని కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అర్వపల్లి: మహాశివరాత్రి పర్వదినమున పురస్కరించు కొని మండల కేంద్రంలోని చిన్న గుట్ట వద్ద గల ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో, జాజిరెడ్డిగూడెం పర్సాయిపల్లి కొమ్మల తదితర గ్రామాల్లో గల శివాలయాల్లో ఉదయం నుండి శివ భక్తుల శివనామస్మరణతో మారుమోగాయి. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని అభిషేకాలం ప్రత్యేక పూజలను కుటుంబ సమేతంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలు చెందిన భక్తులు పాల్గొన్నారు. మరోవైపు రాత్రి స్వామి స్వామి వారి కల్యాణోత్సవం జరగనుంది. ఈ కల్యాణోత్సవానికి ఆలయంలో సుందరంగా అలంకరించారు.



మునగాల: మండలంలోని వివిధ గ్రామాలలో బుధవారం మహా శివరాత్రి వేడు కలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం లోని శివాలయం లో జిల్లా గ్రంధాలయ చైర్మెన్ వం గవేటి రామారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కా ర్యక్రమాన్ని ప్రారంభించారు. మునగాల ఆకుపాముల దేవాలయం లో పెద్ద ఎత్తున మహిళలు పూజ లు నిర్వహించారు.దేవాలయ పురోహితులు వారణాసి బుచ్చి రామయ్యశాస్త్రి వేద మంత్రాలతో స్వామి వారి కల్యాణ మహోత్సవం జరిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నల్లపాటి శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జైపాల్ రెడ్డి,ఆకుపాముల సింగిల్ విండో చైర్మన్ వల్లపురెడ్డి రామిరె డ్డి,మార్కెట్ కమిటీ డైరె క్టర్ కాసర్ల కోటయ్య,వుప్పుల జానికి రెడ్డి,పా ల్గొన్నారు.

మద్దిరాల: మహాశివరాత్రి ని పురస్కరించుకొని మండల కేంద్రం తో పాటు వివిధ గ్రామాలలో శివరాత్రి సందర్భంగా భక్తులు ఆలయాలకు పోటెత్తి శంభో శివ శంభో అంటూ శివనామ స్మరణతో అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ మేరకు నాయకులు, ప్రజాప్రతినిధులు అధికారులు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో శివరాత్రి వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. మద్దిరాల గ్రామంలో ప్రాచీన కాలం నాటి శ్రీశ్రీ రామలింగేశ్వర స్వామి మరియు వివిధ గ్రామాల దేవాలయాలలో శివునికి అభిషేకం చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం జరిగే శివరాత్రి పూజల వల్ల, పరమశివుని దీవెనలతో ప్రజలందరూ ఈ సంవత్సరం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. రైతులు, ప్రజలు పాడిపంటలతో తమ పంటచేలు కళకళలాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నాయకులు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



తుంగతుర్తి: శివనామస్మరణాలతో శివాలయాలు మారు మోగాయి. శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని బుధవారం వేకువజామునే ఆలయాలు భక్తులతో కోలాహలంగా మారాయి. శివాలయాల్లో అభిషేకాలు, అర్చనలు, అన్నదానాలు, శివపార్వతుల కళ్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గం కేంద్రం అయిన తుంగతుర్తితో పాటు మండలంలోని కొత్తగూడెం, అన్నారం, వెంపటి గ్రామాలలోని శివాలయాల్లో శివుడికి వివిధ రకాల అభిషేకాలను వేద మంత్రోచ్చరణలు నడుమ నిర్వహించారు. అభిషేక కార్యక్రమాలకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. కొత్తగూడెం గ్రామంలోని గుట్టమీద ఉన్న స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. మండలంలోని అనేక గ్రామాల నుంచి వందలాదిగా భక్తులు తరలి రావటంతో ఆలయ ఆవరణం అంతా కోలాహలంగా మారింది. మధ్యాహ్నం వరకు భక్తుల రాక కొనసాగింది, మధ్యాహ్నం మూడు గంటల వరకు అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. శివరాత్రి సందర్భంగా సాయంత్రం ఆలయాల్లో భజనలు నిర్వహించారు.ఈ మేరకు పలు దేవాలయాల్లోనూ రాత్రి 9 గంటల నుంచి శివపార్వతుల కళ్యాణాన్ని నిర్వహించారు.అనేకమంది ఉపవాసం ఉండి రాత్రంతా జాగరణ చేశారు. పూజా కార్యక్రమాల్లో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తిరుమలగిరి: మహాశివరాత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలోని మండల కేంద్రాలలో, గ్రామాలలోశివరాత్రి సందర్భంగా భక్తులు ఆలయాలకు పోటెత్తి శంభో శివ శంభో అంటూ శివనామ స్మరణతో అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ మేరకు నాయకులు తుంగతుర్తి నియోజకవర్గంలోని పలు గ్రామాలలో శివరాత్రి వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. తిరుమలగిరి మండలంలోని జలాలపురం గ్రామంలోని గుండ్ల బండ తండ, సమీపాన వెలసిన కాకతీయుల కాలం నాటి శ్రీశ్రీ రామలింగేశ్వర స్వామి, గుండెపురి గ్రామంలో వెలిసిన శ్రీ శ్రీ స్వయంభు మహాదేవరాలింగ స్వామి దేవాలయాలలో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిపించి శివునికి అభిషేకం చేశారు. ప్రతి సంవత్సరం జరిగే శివరాత్రి పూజల వల్ల, పరమశివుని దీవెనలతో ప్రజలందరూ ఈ సంవత్సరం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. రైతులు, ప్రజలు పాడిపంటలతో తమ పంటచేలు కళకళలాడాలని కోరుకున్నారు.



జనసంద్రమైన సంగమేశ్వర దేవాలయం

నవతెలంగాణ-మోతె

మండల పరిధిలోని కూడలి గ్రామంలో ఏటి ఒడ్డున వెలసిన గంగ పార్వతి సంగమేశ్వర స్వామి దేవాలయం బుధవారం శివరాత్రి సందర్భంగా జన సముద్రం అయింది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనిమొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు నామవరం సిరికొండ శివాలయంలో మండల కేంద్రం రాఘవపురం గ్రామంలో శ్రీ కంఠమహేశ్వర స్వామి సూరమాంబ దేవాలయాల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు దేవాలయాలు దర్శించుకున్న వారిలో మాజీ ఎమ్మెల్యే ఎనేపల్లి చంద్రావు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కీసర సంతోషిరెడ్డి కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్ రెడ్డి మాజీ జెడ్పిటిసి పందిళ్ళపల్లి పుల్లారావు, ఆలయ ధర్మకర్త కుక్కునూరు రోహిత్, మాజీ సర్పంచులు పొనుగోటి నరసింహారావు, సంగెం లింగయ్య, పురోహితులు వేదం పురుషోత్తమ శాస్త్రి, హరి ప్రసాద్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుగంటి నాగరాజు గౌడ్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలకృష్ణ, బానోతు రవి తాళ్ల పెళ్లి మధు పాల్గొన్నారు.



హెచ్‌కే మల్టీస్పెషాల్టి హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-హుజూర్‌నగర్

పట్టణంలోని కోదాడ రోడ్డు నందు బుధవారం శివరాత్రి పండుగపూట హెచ్‌కె మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోదాడ ఎమ్మెల్యే నలమాధ పద్మావతిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను పట్టణంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అన్ని వర్గాల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా ఆసుపత్రి యజమాన్యం చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌కే మల్టీస్పెషల్టి హాస్పిటల్ సీనియర్ బయో కెమిస్ట్ క్లినికల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హరికృష్ణ గౌడ్, కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి తన్నీరు మల్లికార్జున్, నాయకులు సుబ్బరాజు, అజీజ్ భాష, కోలపూడి యోహాన్, డాక్టర్ హరికృష్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు చేరుకున్న ఎలక్షన్ సామగ్రి

నవతెలంగాణ-తిరుమలగిరి



నేడు జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎలక్షన్ సామాగ్రితో పాటు సిబ్బంది బూత్ నెంబర్ 141 జెడ్‌పిహెచ్‌యస్ పాఠశాలకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా తహసిల్దార్ హరిప్రసాద్ మాట్లాడుతూ ఈ బూత్‌లో మొత్తం ఓటర్లు 59 కాగా స్త్రీలు 12, పురుషులు 47 ఉన్నారన్నారు. వారి వెంట రూట్ నంబర్ 2 సెక్టోరియల్ ఆఫీసర్ బ్రహ్మయ్య, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలి

- నీటీ పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఎండిపోతున్న పొలాలు
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-సూర్యాపేట

శ్రీరామ్ సాగర్ ఆయకట్టు పరిధిలో నీటి విడుదల లేక పొలాలు ఎండిపోతున్నామని తక్షణమే రైతులకు ఎకరాకు రూ.30 వేలు చెల్లించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పెన్ పహాడ్ మండలంలోని చిన్న గ్యారకుంట గిరిజన తండాల్లో ఎండిపోయిన వరిపొలాలను పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీటి పారుదల శాఖ అధికారుల తప్పుడు సమాచారం వల్ల పెన్‌పహాడ్ మండలంలోని పలు గ్రామాలలో వేలాది ఎకరాల్లో వరి పంట నిలువునా ఎండి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీరామ్ సాగర్ కాలువ ద్వారా యాసంగి పంటకు నీరు విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం జనవరి నెలలోనే ప్రకటించడం వల్ల రైతులు ఎంతో ఆశతో ఎకరానికి 30 వేలు ఖర్చు చేసి నెల రోజుల పాటు కష్ట పడి వరి పండించారని తెలిపారు. తీరా వరి కంకులు పొట్టకొచ్చే సరికి నీళ్ల లేక వరి పోలాలు నిలువునా ఎండి పోతున్న పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. రైతులు దిక్కు తోసని స్థితితో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మకూరు ఎస్ మండలం వద్ద మెయిన్ కాలువ దగ్గర అక్కడి రైతులు తూములు మూసి వేయడం వల్ల పెన్ పహాడ్, మునగాల మండలాలకు చెందిన రైతులకు నీరు రాకుండా పోయిందని తెలిపారు. ఈ ప్రాంత రైతులు రాత్రి పగలు కష్టపడి స్వంత ఖర్చులతో మరమ్మతులు చేసుకున్న కానీ నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు నీటి పారుదల శాఖ అధికారులు సరైన పర్యవేక్షణ కట్టు దిట్టమైన భద్రత లోపం వల్ల దిగువన ఉన్న పెన్ పహాడ్, మునగాల మండలాలకు చెందిన రైతాంగం తీవ్రంగా నష్ట పోయారని నెమ్మాది అన్నారు. జిల్లాకు చెందిన నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నప్పటికి హుజూర్ నగర్ నియోజక వర్గం మీద ఉన్న దృష్టి జిల్లా మొత్తం మీద లేక పోవడం వల్ల వేల ఎకరాల వరి పంట నిలువునా ఎండి పోయిందని పేర్కొన్నారు. దీనికి నీటి పారుదల శాఖ అధికారులు, జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డినే బాధ్యత వహించి రైతులను ఆదుకోవాలని నెమ్మాది డిమాండ్ చేశారు. ఇప్పటికే పెన్ పహాడ్ మండలంలోని భక్తాల్లపురం, ధర్మాపురం, గాజుల మల్కాపురం, నూర్జహాన్ పేట్, న్యూ బంజారాహిల్స్, ఏళ్ళప్పకుంట, చిన్న సీతారాం పురం తండా పెద్దా సీతారాం పురం తండా, చిన్న గ్యారకుంట, పెద్ద గ్యారకుంటా, జల్మాల కుంట, చెట్లా ముకుందపురం గ్రామాలలో పొలాలకు నీటి పారుదల సౌకర్యం లేక పంట ఎండి పోయి రైతులు తీవ్రంగా నష్ట పోయారని వివరించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని ఎండి పోయిన పొలాలను క్షేత్ర స్థాయిలో సర్వే చేసి రైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు. శ్రీరామ్ సాగర్ ఆయకట్టు కింద లష్కర్, సుపర్ వైజర్ పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. నీటి వార బందీని పకడ్బందీగా నిర్వహించాలని, నెమ్మాది డిమాండ్ చేశారు. లేకుంటే నష్ట పోయిన రైతాంగం తో కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎం మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు, రైతులు ధారావత్ నగేష్, వీరన్న, బండి శ్రీనివాస్ రెడ్డి, ధరావత్ లక్ష్మీ , ధారవత్ భీమ్లా, సైదులు, చాక్రియా, దస్రు నాయక్, నాగు, చందర్, రాంరెడ్డి, వెంకన్న, పాల్గొన్నారు.

రఘు మృతి తీరని లోటు



- కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు రఘు మృతి పట్ల ప్రముఖుల సంతాపం

నవతెంగాణ-కోదాడటౌన్

కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు పడిశాల రఘు బుధవారం మృతి చెందారు మంగళవారం సాయంత్రం అనారోగ్యం కారణంగా పట్టణంలోని ప్రయివేట్ ఆసుపత్రికి వెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం తీసుకువెళ్లాలని వైద్యుడు సూచించడంతో అంబులెన్స్‌లో ఖమ్మం వెళుతూ మార్గమధ్యంలో గుండెపోటుతో మృతి చెందినట్లుగా బంధువులు తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రఘు జర్నలిస్టుగా అనంతకాలంలోనే అంచలంచెలుగా ఎదుగుతూ సూర్యాపేట జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కారింగుల అంజన్ గౌడ్ సారథ్యంలో కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన నుండి ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, విద్యార్థుల మేధాశక్తిని పెంపొందించేందుకు టాలెంట్ టెస్ట్ లు క్విజ్ పోటీలు, సమాజాన్ని జాగృతపరిచే కార్యక్రమాలను నిర్వహించారు. అంతేకాకుండా అంజన్ గౌడ్ జర్నలిస్టుల మిత్రుల సలహాతో జర్నలిస్టుల సంఘం నిధి ఏర్పాటు చేసి సంఘంలో ఎవరికైనా ఆపద కలిగిన మరణించిన వారికి నగదు అందజేసే విధంగా మంచి కార్యక్రమానికి రూపకల్పన చేశారు. పూర్తిస్థాయిలో విజయవంతమై ఆపదలో ఉన్న జర్నలిస్టులకు సహాయం అందించారు. కరోనా సమయంలో వరద ఉధృతి సమయంలో జర్నలిస్టుల కుటుంబాలకు అండగా నిలబడ్డారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం హౌసింగ్ సొసైటీని సైతం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడు అంజన్న గౌడ్ ఆదేశాలతో చెప్పిన ప్రతి పనిని విజయవంతం చేసి అందరి చేత మన్ననలు పొందారు. రఘు చివరి అంతిమయాత్రలో జర్నలిస్టులు భారీ స్థాయిలో పాల్గొని పాడే మోసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. జోహార్ రఘు అనే నినాదాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. రఘు పార్థివ దేహానికి, సూర్యాపేట పట్టణ డి.ఎస్.పి రవి,సూర్యాపేట జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కారింగుల అంజన్ గౌడ్, కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపూరి తిరుపతమ్మ సుధీర్, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ బషీర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రనేని వెంకటరత్నం బాబు, ఎమ్మెస్ కళాశాల విద్యాసంస్థల చైర్మన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పందిరి నాగిరెడ్డి, ఎంజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గాద రమేష్, బీఆర్ఎస్ నాయకులు బెజవాడ శ్రవణ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు నహీం,రేస్ ఐఐటి మెడికల్ కళాశాల చైర్మన్ బాణాల వసంత వెంకటరెడ్డి, త్రివేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సిరికొండ శ్రీనివాస్, జర్నలిస్టు సంఘ నాయకులు సోమపంగు గణేష్, కోట రాంబాబు కుడుముల సైదులు ,సురేష్ పూలమాలవేసి నివాళులర్పించారు.

ఘనంగా త్రిలింగేశ్వర స్వామి కల్యాణం

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామంలో గల శ్రీ శ్రీ శ్రీ త్రిలింగేశ్వర స్వామి దేవాలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ జిల్లా నాయకులు, ఆలయ కమిటీ చైర్మెన్ డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, సంతోష ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మొక్కు తీర్చుకున్న మాజీ మేయర్ దంపతులు

నవతెలంగాణ-యాదగిరిగుట్ట

హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ దంపతులు బుధవారం మండలపరిధిలోని మైలారిగూడెం గ్రామంలో మొక్కులు తీర్చుకున్నారు. ఆయన భార్య చెర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి రామ్మోహన్ జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైనందున మైలార్‌గూడెం దుర్గమ్మ గుడి వద్ద తన మొక్కు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పసుల నరేష్‌యాదవ్, పవన్, శ్రీకాంత్ రెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



బస్వాపురం ప్రాజెక్టు పూర్తి కోసం..

రూ. 300 కోట్లు కేటాయించాలి

- వడపర్తి కత్వకు రూ. 6 కోట్లు కేటాయించాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.జహంగీర్

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం బస్వాపురం రిజర్వాయర్‌కు తక్షణం 300 కోట్ల రూపాయలు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని, ముంపునకు గురైన నిర్వాసితులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని, ప్రాజెక్టు నుండి వడపర్తి కత్వ వరకు కాల్వను పూర్తి చేయడానికి రూ.6 కోట్లు విడుదల చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి. జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆపార్టీ ఆధ్వర్యంలో భువనగిరి మండలపరిధిలోని వడపర్తి పరిధిలోని వాగు చెరువును, చౌకులతండా దగ్గర నిర్మాణం అవుతున్న కాలువను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో సాగు, తాగు నీటికి కీలకంగా ఉపయోగపడే బస్వాపురం రిజర్వాయర్ నిర్మాణానికి రూ. 300 కోట్లు కేటాయించి విడుదల చేస్తే నిర్వాసితులుకు పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించడానికి, ప్రాజెక్టు పూర్తి చేయడానికి అవకాశం ఉందన్నారు.



ఇప్పటికైనా స్థానిక శాసనసభ్యులు, జిల్లా మంత్రి, నీటిపారుదల శాఖమంత్రి బాధ్యత తీసుకొని వచ్చే బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించి విడుదల చేయాలని సూచించారు. భువనగిరి మండలపరిధిలోని అత్యంత కీలకమైన వడపర్తికత్వను నింపితే భువనగిరి, బీబీనగర్ చెరువులు నింపడంవల్ల వాటి ఆధారంగా పదుల సంఖ్యల గ్రామాలలోని చెరువులు నిండుతాయని వందలాది ఎకరాల భూములు సాగులోకి వస్తాయని తెలియజేశారు.ఇప్పటికే ప్రభుత్వం చౌకులతండ నుండి వడపర్తి కత్వ వరకు కాల్వ తీయడానికి ప్రతిపాదన ఉన్నదని, ఈ కాల్వ నిర్మాణానికి కేవలం రూ.6 కోట్లు కేటాయిస్తే పూర్తి కావడానికి అవకాశం ఉందన్నారు. రానున్న కాలంలో ప్రాజెక్టు పూర్తి కోసం, కాలువల నిర్మాణం కోసం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఏదునూరి మల్లేశం, మండల కమిటీ సభ్యులు పాండాల మైసయ్య, శాఖ కార్యదర్శి పాండాల ఆంజనేయులు, నాయకులు తెల్జూరి మాణిక్యం, రైతులు ఎర్ర మహేష్, మేడబోయిన బాలయ్య, ముత్తయ్య, పెద్దగోల్ల సుదర్శన్, బాలయ్య, జిన్నా రామచంద్రం, శ్రీనులు పాల్గొన్నారు.



లోతుకుంటలో చెట్ల తొలగింపు

నవతెలంగాణ-రామన్నపేట

ఇటీవల పలు అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనడానికి రామన్నపేట మండలకేంద్రానికి ఎమ్మెల్యే వేముల వీరేశం విచ్చేసిన సందర్భంలో చౌటుప్పల్ ఆర్డీవో వి.శేఖర్‌రెడ్డితో కలిసి కంపచెట్లతో నిండిపోయిన లోతుకుంటను సందర్శించారు. ఈ సందర్భంగా లోతుకుంటలోని కంపచెట్లను తొలగించి, సర్వే చేసి బౌండరీస్ ఫిక్స్ చేసి హద్దురాళ్ళు నాటాలని, ఫెన్సింగ్ చేయాలని ఆర్డీవోకు సూచించారు.దీంతో అధికారులు మూడు రోజులుగా లోతుకుంటలో జేసీబీతో కంపచెట్లను తొలగించే ప్రక్రియ ముమ్మరంగా సాగుతుంది. లోతుకుంటలో కంపచెట్లను తొలగిస్తుండడంతో మండలకేంద్ర ప్రజలు, యువకులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.నిరుపయోగంగా ఉన్న ఈ ప్రాంతాన్ని అన్ని రకాలుగా ప్రజాప్రయోజనార్థం వాడుకోవచ్చునని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం వ్యక్తం చేశారు.అదేవిధంగా చాకలికుంట, వెంకట్రామయ్య చిన్న చెరువును సైతం సర్వే చేసి హద్దురాలు నాటి, కంచెను ఏర్పాటు చేసి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని పట్టణ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



బ్రిడ్జి పైనుండి మూసీనదిలో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-రామన్నపేట

మూసీనది బ్రిడ్జిపై నుండి ద్విచక్ర వాహనంతో సహా పడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని లక్ష్మాపురం గ్రామ పరిధిలోని మూసీ నదిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది.ఎస్సై మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం వేములకొండ గ్రామానికి చెందిన కోలగాని వెంకటేశం (58) మేస్త్రి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు.రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామానికి మేస్త్రి పని కోసం మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వచ్చారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మృతుడి భార్య ఇంటికి రమ్మని ఫోన్ చేయగా వస్తున్నానని తెలిపారు. సాయంత్రం ద్విచక్ర వాహనంపై సొంత గ్రామమైన వేములకొండకు వెళుతుండగా బ్రిడ్జిపై నుండి ద్విచక్ర వాహనంతో సహా నదిలో పడడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. మార్నింగ్‌వాకింగ్‌కు వెళ్లిన, లక్ష్మాపురం గ్రామానికి చెందిన జోగుల నరసింహ చనిపోయి ఉన్న దృశ్యాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మోటార్ సైకిల్‌పై ఉన్న నెంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులకు ఫోన్ చేయడంతో మృతుడి కుమారుడు మహేష్ మృతదేహాన్ని చూసి తన తండ్రిదిగా గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకుపోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం



నవతెలంగాణ-రామన్నపేట

ఈనెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ బూతులో అధికారులు బుధవారం సర్వం సిద్ధం చేశారు. మండలవ్యాప్తంగా 59 ఓట్లుండగా అందులో 37 పురుషుల, 22 మహిళ ఓట్లు ఉన్నాయి. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరగనున్నట్లు తహసీల్దార్ లాల్‌బహదూర్ తెలిపారు. అన్ని సౌకర్యాలు కూడా కల్పించమని, ఇలాంటి ఆటంకాలు ఎదురవ్వకుండా పోలింగ్ స్టేషన్ వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.

కన్నుల పండువగా మహాశివరాత్రి ఉత్సవాలు

- భక్తులతో కిటకిటలాడన శివాలయాలు
- శివరాత్రి పండుగకు ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం

నవతెలంగాణ-భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లాలో పలు శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా ద్రావిడ సంస్కృతి, సంప్రదాయాలు కంటికి కనబడే విధంగా బుధవారం నిర్వహించారు. పలు దేవాలయాల్లో విద్యుత్ కాంతులు పూల డెకరేషన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆయా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయము లింగర్చనతోపాటు, శివపార్వతుల కళ్యాణం , అర్ధరాత్రి లింగోద్భవ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఉపవాసాలు ఉండి సాయంత్రం శివస్మరణ చేస్తూ ఖర్జూరపండ్లతో ఉపవాస దీక్ష విడిచారు. ఆలేరులోని కొలనుపాక సోమేశ్వరాలయం, యాదగిరిగుట్టలోని రామలింగేశ్వర స్వామి, సైదాపురంలోని వీరభద్రుడు దేవాలయం ఆలేరు నియోజకవర్గం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రత్యేకపూజలు నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని పచ్చలకట్ట సోమేశ్వర ఆలయంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రత్యేకపూజలు నిర్వహించారు.వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భువనగిరి మండలం సురేంద్రపురి, నమాత్‌పల్లిలో ఉన్న రమణానంద ఆశ్రమాలు లో పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. వేలాదిమంది భక్తులు క్యూ కట్టి లింగదర్శనం చేసుకున్నారు.

భువనగిరి పట్టణం హనుమాన్‌వాడలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.వలిగొండ మండలం సుంకిశాల, పొద్దుటూరు, రెడ్డరేపాక, గ్రామాలలో జాతరఉత్సవాలు నిర్వహించారు.పురాణ వేషధారణలతో భాగవతాలు కథలు వివరించారు. అగ్నిగుండాలు పలుచోట్ల నిర్వహించారు.

బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో. ..

కృషి ఐటీఐ క్యాంపస్ నందు శ్రీ సాయికృప డిగ్రీ అండ్ పీజీ కళాశాల దగ్గర భువనగిరి బంజారాహిల్స్‌లో ద్వాదశ జ్యోతిర్లింగాలు ప్రదర్శనను ప్రజాపిత బ్రహ్మకుమారీస్ వారు ఏర్పాటు చేశారు. బ్రహ్మకుమారిస్ ఇన్‌చార్జి బీకే.చంద్రావతి మాట్లాడుతూ ద్వాదశజ్యోతిర్లింగస్మరణం భారతదేశంలోని 12 జ్యోతిర్లింగాలు ఈ రాష్ట్రాల్లో ఉన్నాయన్నారు. ఈ మహాశివరాత్రి పర్వదినం రోజున ఇలాంటి కార్యక్రమాలను ప్రదర్శించినందుకు భక్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బి కే చంద్ర, బికె రామేశ్వర్ , బికె లావణ్య , బికె బ్రహ్మచారి , బికే అరుణ , బికె శివాని , బి కే ప్రేమలత గారు, బి కే జహంగీర్ తోపాటు కృషి ఐటీఐ, శ్రీ వాగ్దేవి జూనియర్, ఒకేషనల్ , శ్రీ సాయి కృప డిగ్రీ అండ్ పీజీ కళాశాల చైర్మన్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ హాజరై ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకున్నారు.

ప్రత్యేక బస్సులు. .

ఆర్టీసీ యాదగిరిగుట్ట డిపో వారు శివరాత్రి పురస్కరించుకొని భువనగిరి శివార్లో ఉన్న స్వర్ణగిరి, బొమ్మలరామారం మండలానికి ఆనుకొని ఉన్న కీసరగుట్టకు, యాదగిరిగుట్టకు, కొలనుపాకకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.

వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం సైదాపూరం బుధవారం, వీరభద్ర స్వామి ఆలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, బీర్ల ఫౌండేషన్ చైర్మెన్ బీర్ల అనిత కుటుంబ సమేతంగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా శివయ్యకు అభిషేకం చేసి అనంతరం వీరభద్ర స్వామికి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలు, ఆలేరు నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని పాడి పంటలు సమృద్ధిగా పండాలని శివయ్యను వేడుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు బీర్ల ఐలయ్య దంపతులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మండల నాయకులు దుంబల వెంకటరెడ్డి, మండల అధ్యక్షులు కానుగు బాలరాజ్‌గౌడ్, మండల ఓబీసీ చైర్మెన్ శిఖ అరవింద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్: చౌటుప్పల్ మున్సిపాలిటీతోపాటు పరిధిలోని తంగడపల్లి, లింగోజిగూడెం, తాళ్లసింగారం, లింగారెడ్డిగూడెం, లక్కారం గ్రామాల్లో ప్రజలు మహాశివరాత్రి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుండే దేవాలయాల వద్ద భక్తులు బారులు తీరారు.పట్టణకేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం, వలిగొండ రోడ్డులోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం, శివాలయాలు తదితర ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా పూల ధరలు ఒక్కసారిగా ఆకాశన్నంటాయి. పండ్లు, పూలు కొనడానికి ప్రజలు మార్కెట్‌లలో పోటెత్తారు.

సిద్ధులగుట్ట దేవస్థాన బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న ప్రభుత్వ విప్

ఆలేరుటౌన్: జనగామ జిల్లా బచ్చనపేట మండలం కొడువటూరు గ్రామంలోని స్వయంభూ సిద్దేశ్వర స్వామి దేవస్థానం సిద్ధులుగుట్టలో శివరాత్రి సందర్భంగా అంగరంగ వైభోపేతంగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.మహా శివరాత్రిని పురస్కరించుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. ముందుగా స్వామివారికి అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం, ఆలయ అధికారులు శాలువాతో సన్మానించి ప్రసాదాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ సిద్దుల గుట్టను దర్శించుకోవడం సంతోషకరంగా ఉందన్నారు.ఈ ఆలయ అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర,ఆలేరు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.

ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో,గోలనుకొండ గ్రామంలోని శంభులింగేశ్వర స్వామి ఆలయంలో, శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కుటుంబ సభ్యులతో ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు,అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పరిసరాలు మొత్తం ఓం నమ:శివాయ అనే నామస్మరణలతో మారుమోగాయి. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ చైతన్యరెడ్డి, నాయకులు కె.బాలరాజు, శ్రీశైలం,జి.అశోక్, కె .వెంకటేశ్వరరాజు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మండలంలోని కొలనుపాక గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన సోమేశ్వరాలయం, శరబణాపురంలోని ఉమామహేశ్వర ఆలయం, తూర్పు గూడెం, మంతపురి, కొల్లూరుతో పాటు ఇతర గ్రామాలలోని శివాలయాలు, ఆలేరు పట్టణంలోని శివాలయం, చండికా సహిత శివాలయం, సాయిగూడెం శివాలయం, మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. లయాలను అందంగా ముస్తాబు చేశారు.

వలిగొండ రూరల్: మండలంలోని సంగెం, ప్రొద్దటూరు, రెడ్లరేపాక, శ్రీ మత్స్యగిరి ఆలయంలోని శ్రీ పంచముఖ రామలింగేశ్వర స్వామి ఆలయంలో, అరూర్, వివిధ గ్రామాలలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని స్వామివారికి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.మత్స్యగిరి ఆలయంలో రామలింగేశ్వర స్వామి కల్యాణానికి ఆలయ కమిటీ చైర్మెన్ కొమ్మారెడ్డి నరేష్ రెడ్డి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆలయాలన్నీ భక్తుల శివనామ స్మరణతో మారుమోగాయి. సంగెం భీమలింగేశ్వర స్వామికి స్థానిక శాసన సభ్యులు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొని స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మార్కెట్ కమిటీ చైర్మెన్ భూక్యా భీమానాయక్, మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజ్, బోనగిరి మాజీ మున్సిపల్ చైర్మెన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కానుకుంట్ల బాబురావు,బాతరాజు నరసింహ, పాశం సత్తిరెడ్డి, బద్ధం సంజీవరెడ్డి, కంకల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట: మండల కేంద్రంలోని సదాశివ ఆలయం, పురాణ మఠం శివాలయం, ఇంద్ర పాలనగరంలోని శంకర్ గుట్టపై ఉన్న శివాలయం, నిదాన్ పల్లి గ్రామంలోని మల్లన్న గుట్టపై ఉన్న మల్లికార్జున స్వామి ఆలయం, బాచుప్పల గ్రామంలోని కాకతీయుల కాలం నాటి పురాతన శివాలయం, సిరిపురం గ్రామంలోని శ్రీ పార్వతీ పరమేశ్వర స్వామి ఆలయం, వెల్లంకి, మునిపంపుల, కక్కిరేణి, నిర్నెముల, ఎన్నారం, సూరారం గ్రామాల్లోని శివాలయాల్లోకి ఉపాసదీక్షలో ఉన్న భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉపవాస దీక్షను విరమించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజపేట: రాజపేట మండల కేంద్రంలోని శివాలయంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చక స్వాములు వైరాగ్యం చంద్రశేఖర్ పంతులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం బీర్ల దంపతులను సత్కరించారు.అదేవిధంగా మండలంలోని సింగారం, రాజాపేట, చల్లూరు, కురారం, బూర్గుపల్లి ఇతర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ఉదయం నుండి స్వామివారి దర్శనం అభిషేకం కోసం క్యూలు కట్టారు. రాజపేట శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో రుద్రాభిషేకం పంచామృతాభిషేకాలు నిర్వహించారు.ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని చల్లూరు గ్రామంలోని అతి పురాతన మహిమాన్విత శ్రీ శ్రీ శ్రీ శివ శంకర పార్వతి ఆలయం బ్రహ్మోత్సవాల సందర్భంగా శివరాత్రి పర్వదినం సందర్భంగా కురువతి శ్రీనివాస చార్య పంతులు ఆధ్వర్యంలో విశేష కార్యక్రమాలు జరిగాయి ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ పంచ వీరారెడ్డి స్నేహలత దంపతులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : మున్సిపల్ పట్టణ కేంద్రంలో శ్రీ మార్కండేశ్వర స్వామి దేవాలయంలో, వీరభద్ర స్వామి దేవాలయంలో, బసవ లింగేశ్వర స్వామి, బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో, మండల పరిధిలోని శివాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


యాదగిరిగుట్టలో..


చౌటుప్పల్‌లో..


వలిగొండలో...


ఆలేరులో..


రామన్నపేటలో..


భువనగిరిలో...


భువనగిరిలో...


రాజపేటలో...


భువనగిరిలో...


భూదాన్‌పోచంపల్లిలో..

నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
గురువారం | ఫిబ్రవరి 27, 2025 | www.navatelangana.com

సీపీఐ నాయకునికి పరామర్శ

నవతెలంగాణ-మోటకొండూరు



మండలంలోని చాడ, నాంచారిపేట తదితర గ్రామాల శివ మాల స్వాములు కుంభమేళాకు వెళ్లి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. వారిని చికిత్స నిమిత్తం నాగోల్‌లోని సుప్రజ హాస్పిటల్‌లో చేర్పించారు. గాయాలైన వారిలో నాంచారిపేట గ్రామ వాసి సీపీఐ మోటకొండూరు మండల సహాయ కార్యదర్శి ముసుకు పెంటరెడ్డి ఉండగా వారిని ఆ పార్టీ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమలో వారితో పాటు పలువురు పాల్గొన్నారు.



పెచ్చులూడి... పిట్టగూడుకు నెలవై..

● ఓగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దుస్థితి ● అధికారులు వస్తున్నారు... పట్టింపు లేదు..





నవతెలంగాణ- నకిరేకల్

మండలంలోని ఒగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం స్లాబు పెచ్చులూడి పిట్టగూడుకు నెలవైంది. రాత్రిపూట కోతులకు ఆవాసంగా మారింది. ధ్వంసమైన కిటికీలకు చెక్కలు, వైర్లు అడ్డుపెట్టి కట్టిన ఉన్న చిన్నపాటి భాగంలో నుండి కోతులు రావడం వల్ల ఆసుపత్రి ఓపీ గదితోపాటు వైద్యాధికారి గది సైతం దుర్గంధంగా మారుతుంది.

2001లో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభించారు. వర్షపు నీరు స్లాబుపై నిలువ ఉండటం, స్లాబు పై ఉన్న ట్యాంక్ నీరు సైతం ప్రవహించడం ఫలితంగా స్లాబ్ నాని పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. భవనంలోని ఓపి గది పెచ్చులు పూర్తిగా ఊడిపోయాయి. ఎప్పుడు రోగుల మీద పడుతుందో తెలియని పరిస్థితి ఉంది. భవనంలోని ల్యాబ్, ఫార్మసీ, ఆపరేషన్ థియేటర్, ఇన్ పేషెంట్ గదుల స్లాబు పెచ్చులు సైతం ఊడిపోతున్నాయి. భవనం ముందు భాగంలో కిటికీ పూర్తిగా ధ్వంసం కావడంతో కోతులకు ఆవాసంగా మారింది. ధ్వంసమైన కిటికీలకు వైర్లు చెక్కలు కట్టిన ప్రయోజనం లేకుండా ఉంది. ఇటీవల జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు అయినా నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు.



జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులకు నివేదించాం
యోగస్వి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి

భవనంలోని అన్ని గదుల పెచ్చులు ఊడి ఇబ్బందికరంగా మారింది. ఇటీవల జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కేంద్రాన్ని సందర్శించినప్పుడు ఇబ్బందులను వివరించాం. డీఎంహెచ్ఓకు, స్థానిక ప్రజాప్రతినిధులకు నివేదించాం. పరిస్థితిని వారికి వివరించడంతో సానుకూలంగా స్పందించారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికలు

● ఎన్నికల ఏర్పాట్లు పూర్తి
● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతరావు



నవతెలంగాణ-భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. పోలింగ్ 27న (గురువారం) ఉదయం 8:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు జరగనున్న నేపథ్యం లో బుధవారం 26న రాయిగిరిలో విద్యా జ్యోతి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి..పోలింగ్ సిబ్బంది (పీఓలు,ఏపీవోలు, ఓపీవోలు మైక్రో అబ్జర్వర్లు) ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని తీసుకొని, వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సురక్షితంగా తరలివెళ్లారు.ఈ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ హనుమంతరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి స్వయంగా పరిశీలించారు.

పోలింగ్ ప్రక్రియపై కలెక్టర్ సూచనలు

ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు .జిల్లాలో మండలానికి ఒక్కటి చొప్పున 17 పోలింగ్ కేంద్రాలు పూర్తిగా సిద్ధంగా ఉన్నాయన్నారు.పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిబంధనలను పూర్తిగా అవగాహన చేసుకుని విధులను నిర్వర్తించాలన్నారు. ఓటింగ్ గోప్యతను ఖచ్చితంగా పాటించాలన్నారు.డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలోని ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన ఆయన, తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు వంటి అన్ని వసతులు సమర్థంగా అందుబాటులో ఉంచామన్నారు.

ఎన్నికల నిర్వహణకు చేపట్టిన చర్యలు

మొత్తం ఓటర్లు: 984.

17 మంది పీఓలు, 17 మంది ఏపీవోలు 17 మంది ప్రతి పోలీస్‌స్టేషన్‌కు ఓపీ వీలు 34 మంది మైక్రో అబ్జర్వ్ 15 మంది ఉంటారని తెలిపారు. రూట్ ప్లాన్: ప్రతి మూడు పోలింగ్ కేంద్రాలకు ఒక్క సెక్టార్ ఆఫీసర్ల చొప్పున 6 సెక్టార్ ఆఫీసర్లను నియమించామన్నారు.సమగ్ర మౌలిక సదుపాయాల ఏర్పాటు: తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, మూత్రశాలలు, సీసీ కెమెరాలు,వెబ్ కాస్టింగ్: అన్ని పోలింగ్‌కేంద్రాల్లో ఏర్పాటు చేశామన్నారు

పోలింగ్ సిబ్బందికి ప్రత్యేక మార్గదర్శకాలు

పోలింగ్ సామగ్రి సరైన విధంగా అందిందా అనే విషయాన్ని చెక్‌లిస్ట్ ఆధారంగా ధృవీకరించాలి. బ్యాలెట్ పద్ధతి ప్రకారం పోలింగ్ నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి. ఓటింగ్ కేంద్రాలకు బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బంది తరలింపునకు ప్రత్యేక బస్సుల ఏర్పాటు. పోలింగ్ సామగ్రి తరలింపు సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తినా సంబంధిత అధికారులను వెంటనే సమాచారం అందించాలి. జిల్లాలో మొత్తం 17 పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఉదయం 8:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు ఓటింగ్ కొనసాగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి అధికారులు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విభిన్న పోలింగ్ ప్రక్రియ.

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రధానంగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే, శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొంత భిన్నంగా ఉంటాయి. ప్రాధాన్యతా ఓటుతో. బ్యాలెట్ పద్ధతిన జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియలో ఓటింగ్ నిర్వహణకు ఒకింత ఎక్కువ వ్యవధి పట్టే అవకాశాలు ఉన్నందున ఓపిగ్గా, సంయమనంతో వ్యవరిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహించాల్సి ఉంది.

సెల్‌ఫోన్లకు అనుమతి లేదు

పోలీస్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్ళేందుకు అనుమతి లేదు. పోలీసులు ఓటర్లను తనిఖీ చేసిన తర్వాతనే పోలింగ్ బూత్‌లోకి పంపిస్తారు.

బ్యాలెట్ బాక్సులు నల్గొండకు.. .

పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్ లను తీసుకొని నల్గొండలోని రిసెప్షన్ సెంటర్లో అప్పగించనున్నారు.

తాయిలాలు ..

గతంలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి, నల్గొండ, ఖమ్మం వరంగల్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికలలో పెద్దఎత్తున తాయిలాలు బుధవారం పంపిణీ చేశారు. గూగుల్ పే, ఫోన్ పే, ఇతర పేమెంట్‌ల ద్వారా ఓటర్లకు డబ్బులు పంపించారు. ఈ అంశం చర్చనీ యాశంగా మారింది.

కోలగాని వెంకటేశం మృతి సీపీఐ(ఎం)కు తీరని లోటు

● సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్

నవతెలంగాణ-వలిగొండ రూరల్



సీపీఐ(ఎం) పార్టీ వేములకొండ గ్రామ శాఖ కార్యదర్శి భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కోలగాని వెంకటేశం మృతి సీపీఐ(ఎం)కు, వారి కుటుంబానికి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ అన్నారు. వేములకొండ లక్ష్మాపురం గ్రామాల మధ్యన బ్రిడ్జిపై ప్రయాణం చేస్తూ మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు బ్రిడ్జి మీద నుండి పడి మృతి చెందిన వెంకటేశం అంత్యక్రియల్లో బుధవారం ఆయన పాల్గొని నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటేశం ఆశయ సాధన కోసం వారి స్ఫూర్తితో సీపీఐ(ఎం) కార్యకర్తలు పని చేయాలని కోరారు. చిన్ననాటి నుండి పార్టీ జెండా కింద కార్మికుల హక్కుల కోసం వెంకటేశం పోరాడాడని గుర్తు చేశారు. వారి కుటుంబానికి సీపీఐ(ఎం) ఎల్లవేళలా ఉండగా ఉంటుందని కుటుంబ సభ్యులు ధైర్యంతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కందడి సత్తిరెడ్డి, సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు కర్ణకంటి యాదయ్య,సీఐటీయూ జిల్లా నాయకులు రాధారపు మల్లేశం,చేగురి నగేష్, సీపీఐ (ఎం) వేములకొండ నాయకులు పులిపల్పుల మల్లేశం, అడిచర్లపల్లి ధర్మాచారి, కాడిగళ్ల రాకేష్, వల్కి భిక్షపతి, ఏనుగుల నర్సింహ, సంఘపాక భిక్షం, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జయవీర్ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-తిరుమలగిరి సాగర్

మండలంలోని రంగుండ్ల గ్రామంలో రంగమ్మ గుండ్లలలో వెలసిన 'శ్రీ భగుడు పంచాయితన' శివాలయంలోబుధవారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి ప్రత్యేక ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి , మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మల పల్లి చంద్రశేఖర్ రెడ్డి ,మాజీ ఎంపిపి ఆంగోత్ భగవాన్ నాయక్,కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డం సాగర్ రెడ్డి ,మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్‌కలసాని చంద్రశేఖర్ మాజీ మండల ఎస్టిసెల్ అధ్యక్షుడు ఆంగోత్ బాలునాయక్ ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆంగోత్ పాండు నాయక్ ,నాయకులు శాగం రఘువ రెడ్డి ,మిట్టపల్లి శ్రీనివాస్ ,కోట్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాలకన్నా అన్నదానం గొప్పది



అన్ని దానాల కన్నా అన్న దానమే గొప్పదని మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఆంగోత్ బాలు నాయక్ ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆంగోత్ పాండునాయక్‌లు అన్నారు. బుధవారంమండలంలోని రంగుండ్ల గ్రామంలో రంగమ్మ గుండ్లలలో వెలసిన శ్రీ భగుడు పంచాయితన శివాలయంలోబుధవారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మహా అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆంగోత్ హనుము నాయక్ ,శ్రీనివాస్ చారి ,శంకర్ నాయక్ ,మహేష్ ,సర్దార్, బాబురావు ,శ్రీనునాయక్ ,మంగ్తా ,కిషన్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

● సర్వారంలో మహా అన్నదానం

నవతెలంగాణ-గరిడేపల్లి



మండలంలోని పొనుగోడు, సర్వారం కీతవారిగూడెం, గరిడేపల్లి శివాలయాలకు మహాశివరాత్రి సందర్భంగా బుధవారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ప్రధానంగా పొనుగోడు త్రిలింగేశ్వర దేవాలయం, కీతవారిగూడెం పార్వతి రామలింగేశ్వర దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచి ప్రారంభమైన భక్తుల తాకిడి సాయంత్రం వరకు నిరంతరాయంగా కొనసాగింది. కీతవారిగూడెం, సర్వారం పొనుగోడు గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా మహా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. శివాలయాల్లో ఉదయం నుంచి అభిషేకాలు, ప్రత్యేక హెూమాలు నిర్వహించారు. శివాలయాల్లో వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. రాత్రి ఈ మూడు శివాలయాల్లో పార్వతి పరమేశ్వరుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి పెద్ద ఎత్తున భక్తులు దేవాలయాలకు తరలివచ్చారు. శివాలయాల ఆవరణలో అనేకమంది భక్తులు ఉపవాస దీక్షలను చేపట్టారు. దీక్ష చేపట్టిన భక్తులు జాగారం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లను ఆలయాల్లో కల్పించారు. గురువారం ఉదయం వరకు జాగారం చేసే భక్తులకు భజనలు, కోలాటాలు, సంగీత కచేరీలు లాంటివి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్వారం దేవాలయం కమిటీ సభ్యులు పొనుగోడు త్రిలింగేశ్వర దేవాలయ చైర్మన్ కుక్క డపు శ్రీనివాస్, కీతవారిగూడెం శివాలయం చైర్మన్ జుట్టుకొండ చంద్రయ్య, గరిడేపల్లి శివాలయం చైర్మన్ నలజాల రామారావు, ఆలయ అర్చకులు రాయప్రోలు భద్రయ్య శర్మ, ఉపేందర్ శర్మ, కొంకపాక పవన్ కుమార్ శర్మ, కొంపెల్లి కృష్ణ శాస్త్రి, తో పాటు గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మకర తోరణం అలంకరణ మహోత్సవం

నవతెలంగాణ-మునుగోడు

మండలంలోని కొరటికల్ గ్రామంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానం నందు ఆంజనేయ స్వామి విగ్రహానికి మకర తోరణ అలంకరణ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాత మందుల సైదులు స్వాతి కుటుంబ సమేతంగా పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆంజనేయ స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో సైదులు కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ గ్రామంలోని యువత సేవ భావమును అలవర్చుకొని సేవా కార్యక్రమాలను నిర్వహించినప్పుడు , గ్రామంలోని యువత లో భక్తి భావంతో పాటు సేవా భావం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



శాసన మండలి సభ్యులు కోటిరెడ్డి పూజలు

నవతెలంగాణ-పెద్దవూర

మండలంలోని తేప్పలమడుగు గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవానికి జిల్లా శాసన మండలి సభ్యులు మంకెన కోటిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ కోటిరెడ్డిని దేవాలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలోమాజీ అనుముల యంపిపి అల్లి పెద్దిరాజుయాదవ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు నాగేండ్ల కృష్ణారెడ్డి,దేవాలయ చైర్మన్ గంగరాజు, వైస్ చైర్మన్ సైదులు,కమిటీ సభ్యులు కుంటిగొర్ల రాజశేఖర్, మాజీ సర్పంచులు కుంటిగొర్ల చెన్నయ్య,మహిళా నాయకురాలు చామాల శ్యామల,తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

● తహసీల్దార్ దయానందం

నవతెలంగాణ-తుంగతుర్తి

నల్గొండ ఖమ్మం వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు మండలంలో జరిగే ఎన్నికలకి సర్వం సిద్ధం చేసినట్లు తుంగతుర్తి తహసీల్దార్ దయానందం తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికలలో మండలంలో మొత్తం 54 మంది ఉపాధ్యాయులు ఓటరుగా నమోదయి ఉన్నారని తెలిపారు. ఇందులో 45 మంది పురుష ఓటర్లు 9మంది స్త్రీ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఉదయం 8:00 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

శ్రవణ నక్షత్రం ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-రాజపేట

రాజపేట మండలం రఘునాథపురం గ్రామం లో వేంచేసియున్న శ్రీదేవి,భూదేవి, సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో మార్గశిర మాసం శ్రవణ నక్షత్రం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు శ్రీస్వామి వారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీ స్వామి వారి మూలమూర్తికి పంచామృతాలతో, ప్రత్యేక అభిషేకాలు ఆలయ వైస్ చైర్మన్ రాచకొండ స్వామి కమిటీ సభ్యుల భక్తుల ఆధ్వర్యంలో, ఆలయ అర్చకులు శ్రీ సౌమిత్రి రఘునాథ చార్యులు ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామి వారిని నూతన వస్త్రాలతో పూలమాలలతో శోభాయమానంగా అలంకరించి అష్టోత్తర శతనామార్చనలు సహస్రనామార్చనలు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు, కార్యక్రమాన్ని అత్యంత వైభవోపేతంగా ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
గురువారం | ఫిబ్రవరి 27, 2025 | www.navatelangana.com

ఘనంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం



ప్రత్యేక పూజలు నిర్వహించిన వేముల వీరేశం దంపతులు



కేతపల్లి....

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం సతీ సమేతంగా నార్కెట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు బుధవారం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అర్చకుల ఆశీర్వచనాలు పొందారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బత్తులఉశయ్య మాజీ జెడ్పిటిసి దూదిమెట్ల సత్తయ్య పుల్లెంల అచ్చాలు గౌడ్ వడ్డే భూపాల్ రెడ్డి సట్టు సత్తయ్య జేరిపోతుల భరత్ ప్రజ్ఞాపురం సత్యనారాయణ పార్టీ కార్యకర్తలు ఆలయ అర్చకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిగూడ: మండలంలోని ఇందుర్తి గ్రామంలో ఉన్న శ్రీ శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శివపార్వతుల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మాజీ



మంత్రిగూడ....

సర్పంచ్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు చెరుకు లింగంగౌడ్ దంపతులు,కుంభం సురేందర్ రెడ్డి దంపతులు, మాజీ ఎంపీటీసీ ఊరు పక్క సరిత నగేష్ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించి కళ్యాణాన్ని జరిపించడం జరిగింది.భక్తులు వేల సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో వంశి శర్మవెంకట ఆచారి పంతులు,వెంకట్ రెడ్డి,నాగ బండి నరసింహ,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చండూరు : మహాశివరాత్రి సందర్భంగా చండూరు, గట్టుప్పల మండలాలలో భక్తుల రద్దీతో శివాలయాలు కిటకిటలాడాయి. బుధవారం తెల్లవారుజాము నుంచి మండలంలోని తుమ్మలపల్లి శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, చండూరు శ్రీ మార్కండేశ్వర ఆలయం, శ్రీ శ్రీ భవాని శంకర్ ఆలయం, అంగడిపేట శివాలయం, గట్టుప్పలలో వీరభద్ర స్వామి ఆలయం లో,వివిధ ఆలయాలకు భక్తులు బారులు తీరారు. కొన్నిచోట్ల అన్న ప్రసాదాలు కార్యక్రమాలు నిర్వహించారు.

చిట్యాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని చిట్యాల మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలలోని శివాలయాలలో భగవంతున్ని దర్శనం చేసుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాలయంలో నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ప్రత్యేక పూజలు నిర్వహించి శివుని ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జడల చిన్న మల్లయ్య యాదవ్, కనకదుర్గమ్మ దేవస్థానం కమిటీ చైర్మన్ మారగోని ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు బెల్లీ సత్తయ్య, ఏళ్ల చంద్రశేఖర్ యాదవ్, ఏర్పుల పరమేష్, ఎద్దులపూరి కృష్ణ, జంపాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కేతపల్లి: మహాశివరాత్రి వేడుకలను కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో బుధవారం ప్రజలు ఘనంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సందర్భంగా మండలములో గ్రామాలలో ఉన్న శివాలయాలలో ప్రత్యేకంగా విద్యుత్కాంత్రతో అలంకరించి అలంకరించారు భక్తులు బుధవారం తెల్లవారుజాము నుంచే మహా శివునికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఇనుపల గ్రామంలో ఉన్న శ్రీ పచ్చల పార్వతి సోమేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు బారీ సంఖ్యలో కీలు నిలబడి దర్శనం చేసుకున్నారు అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివాలయ చైర్మన్ తిరుగుడు జితేంద్ర యాదవ్ పలువురు ధర్మకర్తలు పాల్గొన్నారు.

నార్కెట్‌పల్లి: పవిత్రమైన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నార్కట్పల్లిలోని భక్తులు నదీ స్నానాలు ఉపవాసం జాగరణ దీక్షలను అత్యంత నిష్ఠతో ఆచరిస్తూ ఆ శంకరుడు సకల శుభాలను ఆనందఆరోగ్యాలను అనుగ్రహించాలని కోరుకుంటూ బుధవారం ఉదయం నుండే ఆలయానికి విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా చందాలను భక్తిశ్రద్ధలతో సమర్పించుకుంటు తమ మొక్కులను కోరికలను నెరవేర్చాలని వేడుకుంటున్నారు.

28న సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు



నవతెలంగాణ-మఠంపల్లి

ఈనెల 28న హుజూర్‌నగర్ పట్టణంలో నిర్వహించనున్న సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని జిల్లా ఎస్టి సెల్ అధ్యక్షులు దరావత్ నవీన్ నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సేవాలాల్ జయంతి ఉత్సవాలు కమిటీ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు.పార్టీలకు అతీతంగా గిరిజన మాజీ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు,లాయర్లు, డాక్టర్లు,గిరిజన మేధావులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్, కో కన్వీనర్, తులసి రామ్ నాయక్, సైదులు నాయక్,రాష్ట్ర నాయకులు బానోతు భాస్కర్ నాయక్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ బాబు నాయక్, ఎస్టి సెల్ అధ్యక్షులు రాముడు, విటి నాయక్, సీపీఐ(ఎం) నాయకులు భూక్య పాండు నాయక్,యూత్ కాంగ్రెస్ ప్రేమ్ నాయక్, యంకు, బాలు, మోహన్ వంకడోతు గోవింద్ నాయక్, శ్రీను నాయక్, నాగేశ్వరావు నాయక్, సిరి హాస్పిటల్ నాగు నాయక్, మాలోత్ రవీందర్ నాయక్, బాలాజీ, నాగరాజు చంటి, కోటేష్ నాయక్, సంతోష్ పాల్గొన్నారు.

శ్రీమాణికేశ్వర మాతా ఆశ్రమంలో మహాశివరాత్రి ఉత్సవాలు



నవతెలంగాణ-క్లాక్‌టవర్

నల్లగొండ మండలపరిధిలోని అక్కలాయగూడెంలో గల శ్రీమాణికేశ్వర మాత్రా ఆశ్రమంలో నాగలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం, మహాశివరాత్రి ఉత్సవాలను పీఠాధిపతి గంగాధర స్వామి ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సూదిని వెంకటరెడ్డి, కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి, ఎం.సంజీవరెడ్డి, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

తహసీల్దార్ శ్రీనివాసరావు

నవతెలంగాణ-నూతనకల్

నేడు జరిగే ఉమ్మడి నల్లగొండ ఖమ్మం వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పూర్తి ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ పి శ్రీనివాసరావు తెలిపారు బుధవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 41 ఓట్లు గాను 32 పురుషులు 9 మహిళల ఓట్లు తెలిపారు. పోలింగ్ సిబ్బంది హాజరైనట్లు పేర్కొన్నారు. పోలింగ్ సిబ్బందికి అన్ని వసతులను ఏర్పాటు చేసి ప్రశాంతంగా పోలింగ్ పూర్తి చేయుటకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయనైనది. సీసీ కెమెరాలను పర్యవేక్షణలో పోలిక జరుగుతున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రమునకు 200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ ను విధించనైనది ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేటట్లు ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు.



పంట నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ-వలిగొండ రూరల్

వలిగొండ మండలం సుంకిశాల గ్రామంలో భూగర్భజలాలుఅడుగంటి నీరందక ఎండిపోయిన పంట పొలాలను సీపీఐ(ఎం) మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, నాయకులు, రైతులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండలకార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ పంట ఎండిపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే పంటఎండిపోయిన పొలాలను సందర్శించాలని, నష్టపోయిన పేద రైతులందర్ని ప్రభుత్వం ఆదుకోవాలని




కోరారు.సుంకిశాల గ్రామంలో సుమారు 20 మంది రైతుల పంట పొలాలు ఎండిపోయాయని, వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే సర్వే నిర్వహించి పైఅధికారులకు నివేదికలు పంపించి రైతులందర్ని తక్షణమే ఆదుకోవడానికి సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి మాసంలోనే భూగర్భజలాలు అడుగంటి నీరందక పంటలు ఈ రకంగా ఎండిపోవడం బాధాకరమన్నారు. మార్చి, ఏప్రిల్ నెలలో మరింత ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కొండే క్రిష్టయ్య, నాయకులు మంగ బాలయ్య, పోలపల్లి పెద్ద స్వామి, పోలేపల్లి ఉప్పలయ్య, రైతులు మొగిలిపాక ఎల్ల స్వామి, పోలేపల్లి స్వామి, బాలనరసింహ, మొగిలిపాక కిష్టయ్య, పోలేపల్లి స్వామి, ఈతాప సత్తయ్య, బట్టు నరసింహ,తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ పదవి పై అనర్హత వేటు

- వెల్లడించిన హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు

నవతెలంగాణ-మోటకొండూరు



ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ పదవి కొద్ది కాలంగా రేపుతున్న ఉత్కంఠకు తెరపడింది. నిత్యం ఏదో ఒక సందర్భాల్లో ప్రజల్లో చర్చ జరుగుతూ చివరగా వైస్‌చైర్మెన్ 'పదవీ అనుకున్నది ఒక్కటి ఐనది ఒక్కటి' అనే ధోరణి వెలువడింది. కాంగ్రెస్ ద్వారా ఎన్నికైన ఆలేరు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్ కాటేపల్లి గ్రామం చాడ రెవెన్యూ పరిధిలోనిది మోత్కూరు మార్కెట్ పరిధిలోకి వస్తుంది.దీనిని సవాలు చేస్తూ అతనిపై తుర్కపల్లికి చెందిన ఎస్. పరమేష్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. వాదోపవాదాలు విన్న తరువాత తన పదవి చట్ట విరుద్ధమని అనర్హత వేటు వేసి ధర్మాసనం తీర్పునిచ్చింది.ఇదే సవాలు చేస్తూ మోటకొండూర్ నుండి ఎగ్గిడి కృష్ణ, ఆలేరు నుండి కందుల శంకర్ బాహుపేట నుండి జంపాల దశరథ కూడా హైకోర్టులో పిల్ దాఖలు చేశారు.ఆలేరు మార్కెట్ కమిటీ పరిధిలోని గ్రామస్తులు మాత్రమే పదవికి అర్హులని, స్థానికేతరుడు కావడంతో వైస్‌చైర్మెన్ పదవికి అనర్హుడిగా న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఇదిలా వుండగా రాజకీయ నాయకుల ఒత్తిడితో అధికారులు అభాసుపాలు అయ్యారనేది జోరుగా చర్చ నడుస్తోంది. అధికారులు నిబంధనలు పాటించలేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

శ్రీ కృష్ణవేణి హై స్కూల్‌లో స్వపరిపాలనా దినోత్సవం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

ఎల్లారెడ్డిగూడెం గ్రామంలోని శ్రీకృష్ణవేణి హై స్కూల్‌లో బుధవారం స్వపరిపాలనా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు అధికారులు, ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులుగా వ్యవహరించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్ట చెన్నయ్య గౌడ్ తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మట్ట సబిత ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్గానిక్ జ్యూస్ ఆరోగ్యానికి ఎంతో మేలు




నవతెలంగాణ-రామన్నపేట

ఆర్గానిక్ జ్యూస్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మెన్ కందుల హనుమంతు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని సుభాష్ సెంటర్ సమీపంలో ఆర్టీసీ షాపింగ్ కాంప్లెక్స్‌లో కందుల శివప్రసాద్, సాయిరాం ఏర్పాటుచేసిన ఆర్గానిక్ ఫ్రెష్‌ఫ్రూట్ జ్యూస్ సెంటర్‌ను కందుల హనుమంతు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్గానిక్ జ్యూస్ తాగడంతో ఎండ తీవ్రతను అధిగమించొచ్చన్నారు.రసాయనిక మందులు వాడని, సేంద్రియ పండ్ల రసాలతో తయారు చేసిన జ్యూస్ తాగాలని కోరారు. ప్రొపరేటర్ కందుల శివప్రసాద్ మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నం చేస్తూనే ఇలాంటి సైడ్‌బిజినెస్ చేస్తూ ఆర్థికపరమైన సమస్యలు రాకుండా అధిగమించవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దబోయిన మణి, రాహుల్, నంగునూరి విజయ్, కేశవదాస్ వెంకటేశం, కందుల మణి, పెద్దబోయినమురళి, మినుముల సందీప్, కందులమహేష్, తెల్లశేఖర్, చిన్నపాక యాదయ్య, పోలేపాక సాయి, ఓం ప్రకాష్, రవి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కేతేపల్లి



వ్యక్తి ఆరోగ్యం బాగాలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటన కేతేపల్లి మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథన ప్రకారం ఇరాలిలా ఉన్నాయి. కేతేపల్లి గ్రామానికి చెందిన గుండిగ బాలరాజు, తండ్రి లేట్ ఇన్నయ్య (50) అతను ఆరోగ్యం బాగోలేక శారీరకంగా మానసికంగా ఇబ్బందులు పడుతూ ఈరోజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇట్టి విషయం లో మృతుని భార్య గుండిగ జోష్మిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కేతపల్లి ఎస్సై శివతేజ తెలిపారు.

మద్యంమత్తులో వాహనానికి నిప్పు

నవతెలంగాణ-రాజపేట

రాజపేట మండలం నరసాపురం గ్రామానికి చెందిన వ్యక్తి బుధవారం తన ద్విచక్ర వాహనం టీపీఎస్‌ను రాజపేటలోని పోలీస్‌స్టేషన్ సమీపంలోని చౌరస్తాలో అందరూ చూస్తుండగానే మద్యం మత్తులో నిప్పంటించుకున్నాడు.

ఘనంగా వేముల విపుల్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-చిట్యాల



నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం తనయుడు వేముల విపుల్ పుట్టిన రోజు సందర్భంగా మండలంలోని పిట్టంపల్లి ,వెలిమినేడు గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని శ్రీ కనుక దుర్గ అమ్మవారి దేవాలయం వద్ద నకిరేకల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఏనుగు రఘుమారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం కేకు కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమలలో కాంగ్రెస్ జిల్లా నాయకులు అంతటి నరసింహ, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు దాదె ఉపేందర్ రెడ్డి,జిల్లా యువ నాయకులు కొసనం అశోక్, రెముడాల నర్సింహ్మ,అందె చందు, జక్కలి రాజు,పానుగుల్ల సురేష్,అందె నరేష్, దేవరపల్లి నవీన్ రెడ్డి, మేడబోయిన సిద్ధు,కొండ రాజు, నవీన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం తనయుడు వేముల విపుల్ జన్మదిన సందర్భంగా బుధవారం మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ తరపున జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమంలోఆ పార్టీ మండల అధ్యక్షులు బత్తుల ఉషయ్య మాజీ జెడ్పిటిసి దూదిమెట్ల సత్తయ్య యాదవ్ మాజీ సర్పంచ్ దూదిమెట్ల స్రవంతి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు జేరిపోతుల భరత్ పాశం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.